## • తొర్రూరు.. జనమే లేరు



పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరులో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ పాల్గొన్న సభలో ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు

# ప్రియాంక సభలోనూ ఖాళీ కుర్చీలే!

- జనంలేక వెలవెలబోయిన కాంగ్రెస్ సభలు
- పార్టీ అగ్రనేత హాజరైనా కనిపించని జనం
- ఖాళీ కుర్చీలను చూసి ప్రియాంక అసహనం
- పాలకుర్తిలో ప్రసంగిస్తుండగానే ప్రజలు జంప్
- హుస్నాబాద్ కాంగ్రెస్ విజయభేరి తుస్సు
- జనసమీకరణ చేయనోళ్లు ఎలా గెలిపిస్తారు?
- స్థానిక నేతలపై ప్రియాంక ఆగ్రహం
- టీపీసీసీ చీఫ్ సభల పరిస్థితి మరీ దారుణం
- రేవంత్ పసలేని ప్రసంగంతో జనం ఇంటిముఖం
- ఖాళీ సభలతో నైరాశ్యంలోకి కాంగ్రెస్ పార్టీ

*తెలంగాణ ఎన్నికల్లో తమదే విజయం అంటూ ఫేక్ సర్వేలు, గాలి మాటలతో మైండ్‌గేమ్ ఆడుతున్న కాంగ్రెస్ పార్టీకి కొత్త టెన్షన్ పట్టుకున్నది. ఆ పార్టీ అభ్యర్థుల తరపున నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న విజయభేరి సభలకు ప్రజలు ముఖం చాటేస్తుండటం హస్తం నేతలను ఆందోళనకు గురిచేస్తున్నది. మొన్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావుఠాక్రే.. నేడు సాక్షాత్తు ఆ పార్టీ అగ్రనేత ప్రియాంకగాంధీ, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాజరైన సభలకు జనం లేకపోవడంతో ఆ పార్టీ నైరాశ్యంలోకి వెళ్లిపోయింది. గెలుపు సంగతి పక్కన పెడితే కనీసం పరువు నిలుపుకొనే పరిస్థితి కూడా లేకుండా పోయిందని పార్టీవర్గాలు ఆందోళన చెందుతున్నాయి.*

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున శుక్రవారం పలు నియోజకవర్గాల్లో విజయభేరి సభలు నిర్వహించారు. ఈ సభలకు రెండుచోట్ల కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ, మరికొన్ని చోట్ల టీపీసీసీ చీఫ్ రేవంత్ హాజరయ్యారు. ఇందులో ఏ ఒక్క సభలోనూ పట్టుమని పిడికెడు జనం కనిపించలేదు. ప్రియాంకగాంధీ పాల్గొన్న హుస్నాబాద్ సభకు 30 వేల మంది వస్తారని ఆ పార్టీ అంచనా వేయగా.. కేవలం 5వేల మందే వచ్చారు. వారు కూడా ఆమె ప్రసంగిస్తుండగానే జారుకున్నారు. నాయకులు జనాన్ని బతిమిలాడుకున్నా ఒక్కరూ వినలేదు. కొందరు నాయకులు, కార్యకర్తలే మిగలగా.. ఖాళీ కుర్చీలను చూస్తూ ఆమె ప్రసంగించారు. ప్రియాంకగాంధీ పాల్గొన్న పాలకుర్తి సభకూడా జనం లేక వెలవెలబోయింది. పాలకుర్తి నియోజకవర్గ సభను తొర్రూరు పట్టణంలో నిర్వహించగా... ప్రియాంకగాంధీ వేదిక పైకి వచ్చేసరికే జనం ఇంటి బాటపట్టారు. ప్రియాంకగాంధీ ప్రసంగం ప్రారంభమైన 10 నిమిషాల తర్వాత సభా ప్రాంగణంలో సగానికిపైగా ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. జనం లేకపోవడంతో ప్రియాంక అసహనంతో ప్రసంగాన్ని త్వరగా ముగించాల్సి వచ్చింది.

### కాంగ్రెస్ నేతలపై ప్రియాంక ఆగ్రహం

రెండు సభల్లోనూ ఖాళీకుర్చీలే దర్శనమివ్వడంతో ప్రియాంకగాంధీ తీవ్ర అసహనానికి గురైనట్టు తెలిసింది. తాను వస్తున్నానని తెలిసికూడా జనాన్ని ఎందుకు సమీకరించలేదని స్థానిక నేతలపై మండిపడ్డట్టు సమాచారం. సభలకే జనాలను తరలించలేని వారు.. క్షేత్రస్థాయిలో ఓటర్లను ఎలా కాంగ్రెస్ వైపు మళ్లిస్తారని ప్రశ్నించినట్టు తెలిసింది. ప్రజలను తరలించే శక్తి లేనప్పుడు తననెందుకు ఆహ్వానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసినట్టు సమాచారం.

### రేవంత్ సభలకూ స్పందన కరువు

టీపీసీసీ చీఫ్ రేవంత్ పాల్గొన్న నకిరేకల్, తుంగతుర్తి, ఆలేరు సభలు అట్టర్‌ఫ్లాప్ అయ్యాయి. ఏ ఒక్క సభలోనూ ఆ పార్టీ కార్యకర్తలు తప్ప ప్రజలు కనిపించకపోవడం గమనార్హం. రేవంత్ వేదికపైకి వచ్చేసరికి పిడికెడు మందే మిగిలారు. ఆయన ప్రసంగం విని నచ్చక మిగతామందికూడా ఇంటి బాట పట్టారు. దీంతో అన్ని సభల్లోనూ 80శాతం ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ఉన్న కొద్దిమంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను చూస్తూ రేవంత్ పసలేని ప్రసంగం చేసి, వెనుదిరిగారు. రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నకిరేకల్, తుంగతుర్తి, ఆలేరు సభల్లో పాల్గొనాల్సి ఉంది. ప్రతికూల వాతావరణం పరిస్థితిలో ఆయన పర్యటన రద్దు కావచ్చని భావించారు. తన కు ఆది నుంచి పార్టీలో వ్యతిరేకంగా వ్యవహరిస్తు న్న ఉత్తమ్, కోమటిరెడ్డి బ్రదర్స్ జిల్లా కావడంతో ఎలాగైనా సరే సభల పేరుతో నల్లగొండలో పర్యటించాలని రేవంత్ చాలెంజ్‌గా తీసుకున్నట్టు ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగింది. అందుకే రోడ్డుమార్గాన బయలుదేరి వచ్చారు. ఇంతకష్టపడి వస్తే సభల్లో జనాలే కనిపించక రేవంత్ షాక్ తిన్నారు.

### కాంగ్రెస్ ఖేల్ ఖతం!

కాంగ్రెస్ మొదటినుంచీ తమకు తెలంగాణలో జనబలం ఉన్నట్టు కలరింగ్ ఇస్తున్నది. ఇందుకోసం చిన్న మైదానాల్లో సభపెట్టి పెద్దసంఖ్యలో జనం వచ్చినట్టు చూపించాలని ప్లాన్ వేసింది. మొదట రెండు, మూడు సభలకు మోస్తరుగా వచ్చిన జనం.. ఆ తర్వాత అన్ని సభలకూ ముఖం చాటేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు వచ్చినా జనం నుంచి స్పందన కరువైంది. ఆ నియోజకవర్గం.. ఈ నియోజకవర్గం అనే తేడా లేకుండా ఎక్కడచూసినా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తుండటంతో కాంగ్రెస్ నేతలు డైలమాలో పడిపోయారు. ఈ సభలను చూస్తుంటే కాంగ్రెస్ ఖేల్ ఖతం అయ్యిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. వారంటీలేని ఆరు గ్యారెంటీలు.. కాంగ్రెస్ నాయకుల గాలిమాటలు విని విసిగివేసారిన జనం ఆ పార్టీని నమ్మడం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సభలకే రాని జనం ఆ పార్టీకి ఎలా ఓటేస్తారని అంటున్నారు.

## సోనియా ఆశీర్వదిస్తే సీఎం అవుతా

**ఎన్నికల ప్రచారంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

*నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో సీఎం అభ్యర్థుల రచ్చ కొనసాగుతూనే ఉన్నది. మరోసారి ఎంపీ, నల్లగొండ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తను సీఎం కావాలనుకొన్న కోరికను బహిర్గతం చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో జరిగిన ప్రచార సభల్లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, తనకు భారీ మెజార్టీ ఇస్తే పెద్ద స్థానంలో ఉంటానని తన మనసులో మాటను వెల్లడించారు. సోనియాగాంధీ ఆశీర్వదిస్తే తాను ఎప్పుడో ఓసారి నల్లగొండ నుంచి సీఎం అవుతానని ప్రకటించారు. అయితే, తనకు పదవులపై పెద్దగా ఆశ లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం ఎక్కువ అని, ఎవరైనా సీఎం కావచ్చని చెప్పారు. ఇప్పటికే పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్నానని, పార్టీ సీనియర్ నేతల్లో తాను ఒకరినని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులతో పాటు కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామని, సంక్రాంతి నుంచి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతామని తెలిపారు. రైతులు తమ పంటను మరో 15 రోజుల వరకు అమ్ముకోవద్దని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బోనస్‌తో కొంటామని పేర్కొన్నారు.*

## • నకిరేకల్.. హస్తానికి బుగుల్



నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా బయటికి వెళ్లిపోతున్న ప్రజలు

## • తుంగతుర్తి.. ప్రజల అనాసక్తి



సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో జరిగిన సభలో అంతా ఖాళీ కుర్చీలే

## • ఆలేరు.. కుర్చీలే హాజరు



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో కాంగ్రెస్ సభలో జనమే లేకుండా ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు


# ఓటమి బాటలో కాంగ్రెస్ ముఖ్యులు

> మొదటిపేజీ తరువాయి...

తేలిపోయింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొంటున్న ఎన్నికల ప్రచార సభలు జనంలేక వెలవెలబోతున్నాయి. ఎన్నికల్లో గెలుపు సంగతి పక్కన పెడితే కనీసం పరువు నిలుపుకొనే పరిస్థితి కూడా లేకుండా పోయిందనే ఆందోళన వారిలో వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్‌లో సీఎం అభ్యర్థులుగా చెప్పుకొనే నేతలు తమతమ నియోజకవర్గాల్లో జనం నుంచి స్పందన రాక చేతులెత్తేస్తున్నారు. సోషల్ మీడియాలో వీస్తున్నది ఉత్త గాలిబుడగేనని తేలిపోతున్నది. సాక్షాత్తు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డే కొడంగల్‌లో కొట్టుమిట్టాడుతున్నారనే ప్రచారం సాగుతున్నది. జగిత్యాలలో జీవన్‌రెడ్డి ఎదురీదుతున్నారు. పదవులే తనను వెతుక్కుంటూ వస్తాయని చెప్పుకున్న జానారెడ్డి కుమారుడు నాగార్జునసాగర్‌లో విలవిల్లాడుతున్నారు. మధిరలో భట్టివిక్రమార్కను ఓడించాలని సాక్షాత్తు కాంగ్రెస్ శ్రేణులే కంకణం కట్టుకున్నాయి. డబ్బుతో ఏదైనా సాధించగలం అని భావించే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండలో నకనకలాడుతున్నారు. ఇటీవల మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీచేసి ఘోర పరాజయాన్ని చవిచూసి పార్టీ మారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి జనం చుక్కలు చూపిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎందుకు కాకూడదనే అభిప్రాయంతో ములుగు బరిలో నిలిచిన సీతక్కకు ములుగులో ముచ్చెమటలు పట్టిస్తున్నారు. క్రితం ఎన్నికల నుంచి సీఎం కుర్చీపై కన్నేసిన మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్‌లో, ఆయన సతీమణి కోదాడలో ఎదురీదుతున్న వాతావరణం కాంగ్రెస్ పార్టీని కలవరానికి గురిచేస్తున్నది.

### అగ్రనేతల సభలు వెలవెల

కాంగ్రెస్ సభలకు జనం ముఖం చాటేస్తుండటంతో అభ్యర్థులు కకావికలమవుతున్నారు. వానను సైతం లెక్కచేయకుండా బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలకు వస్తున్న ప్రజలను చూసి కాంగ్రెస్ శిబిరాలు డీలాపడుతున్నాయి. మల్లికార్జున్ ఖర్గే గద్వాల, నల్లగొండ, మునుగోడుల్లో నిర్వహించిన సభల్లో ఖాళీ కుర్చీలు వెక్కిరించాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ నిర్వహిస్తున్న బహిరంగ సభలు, కార్నర్ మీటింగ్‌లు జనం లేక వెలవెలబోతున్నాయి. ఒక్కో సభకు రెండు మూడు రోజుల ముందు నుంచే జన సమీకరణ చేస్తున్నా పెద్దగా స్పందన రావడం లేదు. శుక్రవారం పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహించిన సభలకు జనం కరువయ్యారు. హుస్నాబాద్‌లో ప్రియాంక నిర్వహించిన సభకు 30 వేల మంది అంచనా వేస్తే కనీసం 5 వేలు కూడా దాటకపోయేసరికి కాంగ్రెస్‌నేతలు తలపట్టుకొన్నారని సమాచారం. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహించిన నకిరేకల్, సూర్యాపేట, తుంగతుర్తి సభలు మొత్తం ఖాళీగానే కనిపించాయి. ఖర్గే, రాహుల్, ప్రియాంక, రేవంత్‌రెడ్డి సభల్లో వారు మాట్లాడుతుండగానే వచ్చిన ఆ కొద్ది మంది జనం కూడా వెనుతిరిగిపోవటం కనిపించింది. నల్లగొండలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిర్వహించిన సభలో జనం వెళ్లిపోతుంటే ఆగండని ఆయన బతిమాలుకోవాల్సి వచ్చింది. అయినా జనం పట్టించుకోకుండా వెళ్లిపోయారు. గత నాలుగైదు రోజులుగా ఇదే పరిస్థితి కనిపిస్తున్నది.




## బీఆర్‌ఎస్ సభరాంగణం.. కాంగ్రెస్ కకావికలం

బీఆర్‌ఎస్ నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలకు జనం తండోపతండాలుగా తరలివస్తున్నారు. సభా ప్రాంగణాల్లో ఉన్న జనంతో పోటీ పడుతూ బయట అదే స్థాయిలో జనం ఎల్‌ఈడీ స్క్రీన్లలో సీఎం కేసీఆర్ ప్రసంగాలను శ్రద్ధగా వింటున్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే సభలే అయినా ఉద్యమకాలం నాటి సన్నివేశాలను ఆవిష్కరిస్తున్నాయి. బోనాలు.. బతుకమ్మలతో మహిళలు సభలకు పోటెత్తుతూ ఉద్యమస్ఫూర్తిని చాటుతున్నాయి. అదే కాంగ్రెస్ పార్టీ సభలు పేలవంగా ఉంటున్నాయి. వచ్చిన జనంలో ఎటువంటి స్పందనా కనిపించటం లేదు. ఇరుకు మైదానంలోనే సభలు పెట్టినా జనం లేక నిండటం లేదు. కాంగ్రెస్ నేతలు కేసీఆర్‌పై, తెలంగాణపై చేస్తున్న ఆరోపణలను జనం ఏ మాత్రం పట్టించుకోవటం లేదు. సోషల్ మీడియాలో పేరుకుపోయిన కట్టుకథలే తప్ప సమాజంలో బీఆర్‌ఎస్ పార్టీపై వ్యతిరేకత లేదని కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభలే తేల్చిచెప్పున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కేసీఆర్‌ను విమర్శించటం ద్వారానే ప్రయోజనం పొందుతామనుకొంటున్నారని ఎద్దేవా చేస్తున్నారు.

# రైతుబంధుకు లైన్ క్లియర్

- పంపిణీకి తొలగిన అడ్డంకులు
- కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి
- ఫలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ కృషి
- కాంగ్రెస్ పన్నాగం పటాపంచలు
- 29, 30 తేదీల్లో ఇవ్వొద్దని ఎన్నికల సంఘం షరతులు
- మూడు రోజులు బ్యాంకులకు సెలవు
- మంగళవారం నుంచి రైతుబంధు పంపిణీకి చర్యలు
- గతంలో మాదిరిగానే ప్రతి రైతుకూ రైతుబంధు
- రైతుల్లో ఉప్పొంగిన ఆనందం

**విడతల వారీగా రైతుబంధు పంపిణీ వివరాలు...**

| సంవత్సరం | సీజన్ | రైతుల సంఖ్య | పంపిణీ మొత్తం | విస్తీర్ణం |
|---|---|---|---|---|
| 2018-19 | వానకాలం | 50.25 | 5,236.29 | 130.91 |
| | యాసంగి | 49.13 | 5,251.83 | 131.30 |
| 2019-20 | వానకాలం | 51.61 | 6,125.54 | 122.51 |
| | యాసంగి | 42.42 | 4,406.48 | 88.13 |
| 2020-21 | వానకాలం | 57.90 | 7,279.02 | 145.58 |
| | యాసంగి | 59.32 | 7,367.32 | 147.35 |
| 2021-22 | వానకాలం | 60.84 | 7,360.41 | 147.21 |
| | యాసంగి | 63.00 | 7,411.52 | 148.23 |
| 2022-23 | వానకాలం | 64.99 | 7,433.13 | 148.66 |
| | యాసంగి | 65.00 | 7,311.08 | 146.22 |
| 2023-24 | వానకాలం | 68.99 | 7,624.74 | 152.49 |
| మొత్తం | - | - | 72,817.04 | - |

(రైతుల సంఖ్య- లక్షల్లో, పంపిణీ మొత్తం- కోట్లలో, విస్తీర్ణం- లక్షల ఎకరాల్లో..)

హైదరాబాద్, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): రైతులకు మేలు చేయాలన్న బీఆర్‌ఎస్ కృషి ఫలించింది. రైతులకు కీడు చేయాలనుకున్న కాంగ్రెస్ కుట్రలు పటాపంచలయ్యాయి. యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధు పంపిణీకి లైన్‌క్లియర్ అయింది. రైతుబంధు పంపిణీకి కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ఇస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. అయితే పలు షరతులతో అనుమతులు జారీ చేయడం గమనార్హం. ఎన్నికలు ఉన్నందున ఈ నెల 29, 30 తేదీల్లో పంపిణీ చేయొద్దని ఆదేశించింది. ఎన్నికల సంఘం షరతులు పెట్టినప్పటికీ అర్హులైన ప్రతి రైతుకూ రైతుబంధు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎప్పటి మాదిరిగానే తొలుత ఎకరం నుంచి రైతుబంధు పంపిణీ ప్రారంభించనున్నది. అయితే ఎన్నికల సంఘం ఆదేశాలతో శనివారం (ఈరోజు) నుంచే పంపిణీ చేయాలని ప్రభుత్వం భావించినప్పటికీ, శని, ఆది, సోమవారం బ్యాంకులకు సెలవులున్నాయి. దీంతో మంగళవారం నుంచి రైతుబంధు సాయం పంపిణీ చేయనున్నది. ఇందుకు సంబంధించి అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించారు. దేశంలో మరే రాష్ట్రం ఇవ్వని విధంగా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమే. ఇప్పటికే రైతుబంధు కింద 11 విడతల్లో రూ.72 వేల కోట్లకుపైగా రైతుల ఖాతాల్లో జమ చేయడం ఒక రికార్డు. రైతుబంధు పథకం ద్వారా ఏటా 65 లక్షలకుపైగా రైతులకు పెట్టుబడి గోస తీరుతున్నది.

### ఈసీని ఒప్పించిన బీఆర్‌ఎస్

రైతుబంధు పంపిణీని అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేసింది. గత నెల 23న ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే రైతుబంధు పంపిణీ చేయకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన ఈసీ రైతుబంధు పంపిణీ చేయొద్దని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోరాటం చేసింది. రైతుబంధుకు అనుమతివ్వాలని కోరుతూ పలుమార్లు ఈసీకి లేఖలు రాసింది. అయినప్పటికీ ఎన్నికల సంఘం పలు సందేహాలను వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో పీఎం కిసాన్ నిధుల పంపిణీకి కేంద్రానికి అనుమతిచ్చినందున రైతుబంధు పంపిణీకి తమకూ అనుమతి ఇవ్వాలని కోరింది. రైతులకు పెట్టుబడి సాయం అవసరాన్ని ఈసీకి నివేదించింది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ విజ్ఞప్తులపై స్పందించిన ఎన్నికల సంఘం ఎట్టకేలకు రైతుబంధు పంపిణీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రైతుబంధుకు లైన్‌క్లియర్ కావడంపై రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. యాసంగి సాగుకు పెట్టుబడి గోస తీరిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## యాసంగిలో 70 లక్షల మందికి లబ్ధి

రైతుబంధు పంపిణీకి కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ అందుకు ఏర్పాట్లు చేస్తున్నది. గతంలో మాదిరిగానే ఈ యాసంగి సీజన్‌లో కూడా తక్కువ భూమి ఉన్న రైతుల నుంచి రైతుబంధు పంపిణీ ప్రారంభిస్తామని వ్యవసాయశాఖ తెలిపింది. రైతుబంధు ద్వారా యాసంగి సీజన్‌లో 70 లక్షల మంది రైతులు లబ్ధి పొందనున్నారని వెల్లడించింది. రైతుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తామని పేర్కొన్నది. ఈ నెల 25,26,27 తేదీల్లో బ్యాంకులకు సెలవులు ఉన్నాయని, 29,30 తేదీల్లో రైతుబంధు పంపిణీకి ఎన్నికల సంఘం అనుమతించలేదని తెలిపింది.